MANASU FOUNDATION - e Chitrapuri
PM DRF: 1212/013
TITLE: Adivaram vaartha 1999 May - 30



30. 5. 99

ఆధునిక జీవనం అన్ని సంబంధాలను తెంపేస్తోంది. మనిషిమనిషికి మధ్య కనిపించని అగాథాలను సృష్టిస్తోంది. పరిచయస్తులు, కాదంటే కొందరు మిత్రులే తప్ప చుట్టుపక్కాలంటే ఎవరో పిల్లలకు తెలియని దశ వచ్చేసింది. బంధుత్వాలేకాదు అత్తామామలన్నా కూడా కంటగింపయ్యింది. వారికి అపురూపమైన వస్తువులు పనికిరానివయ్యాయి. ఈ క్రమంలో దెబ్బతింటున్న మానవ సంబంధాలను ఆర్ద్రంగా, ఆత్మీయంగా వ్యక్తం చేసిన కథ 'పాతచీర'.

# పాత చీర

బి.ఎస్.రాములు

నెలరోజులుగా చుట్టాల తాకిడి. రాజేశ్వరమ్మకు ఊపిరి సలపకుండా ఉంది. మూడో కూతురు లావణ్య రెండో ప్రసూతికని ఇంటికొచ్చినప్పటి నుంచి ఈ తాకిడి మొదలైంది. పి.జి. చేస్తున్న నాలుగో కూతురు వనజ పెళ్ళిచూపుల పేర బంధువుల తాకిడి ఇంకా సాగుతూనే ఉంది.

లావణ్య ఆసుపత్రిలో ప్రసవించింది. చిన్నాపరేషను చేశారు. పెద్ద కూతురు విజయ అత్తగారు చూసిపోవడానికి వచ్చి రెండు రోజులుంది. రెండో వియ్యంకుడు అలా వచ్చి ఇలా వెళ్ళాడు. రాజేశ్వరమ్మ తమ్ముళ్లు, మరదళ్ళు ఓ పూట ఉండి వెళ్ళారు.



ఎంతో దూరం నుండి రాజేశ్వరమ్మ మేనమామ, చిన్నమామ, మేనత్తలు వచ్చారు. రాజేశ్వరమ్మ కూతురుతో ఆసుపత్రిలో ఉండిపోయింది. వాళ్ళు తొలుత ఇంటికి వెళ్ళారు. ఇంట్లో రెండో కోడలు కళావతి వాళ్ళను గుర్తుపట్టలేకపోయింది. కనీసం మంచి నీళ్ళయినా ఇవ్వలేదని, కూర్చోమనైనా అనలేదని బాధపడ్డారు. ఆసుపత్రి వెతుక్కుంటూ వెళ్ళారు. రాజేశ్వరమ్మ కన్పించేసరికి వారికి ఆయాసమంతా తీరినట్టనిపించింది. కుశల ప్రశ్నలయ్యాక రాజేశ్వరమ్మ మేనమామ వీరయ్య అడిగాడు.

"అమ్మాయీ! నాకు ఆరోగ్యం బాగుంటలేదు. కొడుకులు, కోడండ్లు నీకేమైంది దెబ్బయి ఏండ్లచ్చినా గట్టిగున్నవు, మేం నీ అన్ని ఏండ్లు బతుకుతమా అని అనుడే తప్ప డాక్టరుకు చూపించరు. నీకు తెలిసిన డాక్టరుకు చూపించి మందులిప్పించి పుణ్యం కట్టుకోవే" వీరయ్య మామ ముఖం దీనంగా ఉంది.

తన పుట్టువెంట్రుకలు తీసిన మేనమామ దీనంగా అడిగేసరికి రాజేశ్వరమ్మకు ఎంతోజాలి కలిగింది. తన కాళ్ళకు చిన్నప్పుడు వెండి గొలుసులు చేయించాడు. తన పెళ్ళి తానే ముందుండి జరిపించాడు. ఎప్పుడూ ఏదీ చేయి చాపకుండా బతికాడు. నాలుగేళ్ళుగా అతని పరిస్థితి మారింది. ఇంట్లో కోడండ్లు విసుక్కోవడం, కొడుకులు పట్టించుకోకపోవడం.

వీరయ్య మేనమామ మీద రాజేశ్వరమ్మకు ప్రాణం కొట్టుకుంది. భర్తను అడిగితే ఎంత ఖర్చు జరుగుతున్నదో చూస్తూ అడుగుతున్నావా అని అంటాడని సంకోచించింది. పెద్ద కొడుకును అడిగింది. పెద్ద కొడుకు ప్రసాద్‌కిది గాలికిపోయే కంపను తగిలించుకోవడంగా కన్పించింది. అతని ముఖ కవళికలు చూడగానే వీరయ్యకు అర్థమైపోయింది- రాజేశ్వరమ్మని అనవసరంగా ఇబ్బంది పెట్టానని.

"మామా, రెండురోజులు ఉండరాదే! చూపిద్దాం" అంది రాజేశ్వరమ్మ మర్యాద కోసం. నిజంగానే ఉంటానంటే పరేషాన్ అనుకుంటూ లోలోన విలవిలలాడింది. మంచినీళ్ళే ఇవ్వని ఇంట్లో ఉండడం ఎలా అని వీరయ్య తటపటాయించాడు.

"అమ్మాయీ! ఇప్పుడు ఇంటినిండా మందికదా, నేను మల్లా నాల్రోజుల తర్వాత వస్తాను" అన్నాడు వీరయ్య. రాజేశ్వరమ్మ పరువు దక్కింది అని ఊపిరి పీల్చింది.



"ఈ పాతసామానంతా ఎందుకు? దేనికి పనికొస్తుంది. జోకి (తూచి) పాత సామాను వాళ్ళకు అమ్మేయండి" అంది రాజేశ్వరమ్మ రెండో కోడలు కళావతి తన భర్త విశ్వనాథంతో.

రాజేశ్వరమ్మ ఆ మాట విన్నది. ముసలాయన లింగయ్య కూడా ఆ మాట విన్నాడు. ఏమీ మాట్లాడలేదు. రెండో కొడుకే వ్యాపారం చేస్తూ ఇల్లు పట్టుకొని ఉన్నాడు. రెండో కోడలు కళావతి క్రమంగా రాజేశ్వరమ్మగారి స్థానాన్ని ఆక్రమిస్తోంది. గత నాలుగైదేళ్ళుగా రాజేశ్వరమ్మ, లింగయ్య దంపతులు తమ ఇంట్లోనే తాము అత్తామామల హోదా నుండి తల్లిదండ్రుల హోదా నుండి గతిలేక పడివుండే ముసలి చుట్టాల కోవలోకి మారుతూ వస్తున్నారు.

పాత సామాను పడేసిన అటకకేసి ఓసారి చూశాడు లింగయ్య. పొగబారి నల్లగా కరుజెక్కిన అటకలో ఏం ఉన్నదీ కానరాలేదు. కాని ఏమేం ఉన్నాయో తెలుసు. పాతరాట్నం, బట్టలు నేసిన దోనుగు, నూలు చుట్టిన పంటెలు, నూలు సరిచేసే ఈత నార కుంచె, కందిళ్ళు, పాత సందుగలు, పాత బట్టలు, విరిగిన మంచాలు, పాత నవారు, సైకిల్ సామాను, నేత కండెలు, నాడెలు, పాత మగ్గం... పాత వాసాలు, విరిగిన కట్టె కుర్చీలు...

అవన్నీ గుర్తుకు రాగానే లింగయ్య మనస్సు నలభై ఏళ్ళు వెనక్కుపోయింది. బట్టలు నేసినబతుకు, నూలు రంగులద్దిన కాలం. పిల్లల పెంపకంలో విరిగి పాతబడ్డ మంచాలు... తన పెండ్లి మంచం కుసులు విరిగిన కొద్దీ చెక్కిస్తూ పోతే చిన్న మంచంగా మారి, అది పిల్లల మంచంగా సేవ చేసి మూలబడింది.

విశ్వనాథం గుమస్తాను దుకాణం తీయమని పంపి తాను పాత సామాను సర్దడం ప్రారంభించాడు. అటక నుండి అతను అందించడం కళావతి అందుకోవడం- వాటితోపాటు దుమ్ము, ధూళి మీదపడ్తుంటే కళ్ళు నులుముకొంది కళావతి.

అటకమీది సామానులో కాపురాలు పెట్టిన ఎలుకలు బెదిరి ఇల్లంతా పాకుతున్నాయి. ఇన్ని ఎలుకలు ఉన్నాయా ఇంట్లో అని ఆశ్చర్యపోయింది రాజేశ్వరమ్మ. పాత సూటుకేసొకటి కళావతి పట్టుజారి దబ్బున కిందపడి విరిగి విడిపోయింది. అందులో పాత బట్టలు...

రాజేశ్వరమ్మ గుండె కలుక్కుమంది. ఆ సూటుకేసు తనదే. ఎన్నేళ్ళ అనుభవాల తీపిగుర్తులో... పెళ్ళయిన కొత్తలో కొన్న ప్లైవుడ్ చెక్క సూటుకేసది. అందులో తన పాత చీరెలు...

"దిక్కుమాలిన పాత సామానంతా అటకెక్కిస్తారు. అక్కడ పాములు, తేళ్ళు జమైతే ఏం చేసుడు- పనికొస్తదా అంటే ఒక్కనాడూ వాడింది లేదు" అంటూ కోడలు కళావతి చదవడం మొదలెట్టింది. అత్తామామలు ఈ చెవులు మావి కాదనుకుని మౌనంగా వింటూ ఉండిపోయారు.

రాజేశ్వరమ్మ తన పాతకాలం నాటి సూటుకేసు తీసుకొని బట్టలు దులిపింది. అందులో తనకెంతో ఇష్టమైన పాత చీర. వెనకటివన్నీ నూలు చీరలే. నూలు చీరల్తో ఓ సౌకర్యం ఉంది. అవి చిరిగిపోయాక రెండు చీరలు వేసుకొని కుడ్తే ఓ మెత్తని బొంత అయ్యేది. నులక మంచం మీద బొంత ఎంతో మెత్తగా ఉండేది.



1

ఈ పాత చీరను బొంత కుట్టించడానికి మనసొప్పలేదు. తమ ఇంట్లో జరిగిన శుభకార్యాలన్నిటికి ఈ పాత చీరె సాక్షి. రెండో కూతురు పెళ్ళినాడు ఈ చీర కట్టుకునే కాళ్ళు కడిగింది. రెండో కోడలి పెళ్ళిలోనూ తాను ఈ చీర కట్టుకుంది. ఎన్ని పురుళ్ళో, పుట్టు వెంట్రుకలో... మరెన్ని పండుగ పబ్బాలకో ఈ చీర కట్టుకుంది. మేనమామ వీరయ్య ప్రత్యేకంగా నేయించి తల్లిగారి తరఫున తాము ఈ ఇల్లు కట్టి ఇండ్లల్లోకి పోయినప్పుడు పెట్టిన అద్భుతమైన తొమ్మిది గజాల జరీ అంచు చీర.

రాజేశ్వరమ్మ ఆ చీరను నీళ్ళల్లో నానేసి ఉతికింది. ఎంతో దుమ్ము, మరెంతో పొగ. ఓసారి జాడించాక సబ్బురాసి ఉతికింది. అప్పుడు కాస్త చీర రంగు ఏదో స్పష్టమైంది. బయట ఆరేసింది.

"ఔ! ఈ చీరె ఎప్పటిదో గుర్తుపట్టినవా!" అంటూ లింగయ్యకేసి చూసి నవ్వింది రాజేశ్వరమ్మ. లింగయ్య ఆ చీరను గుర్తుపట్టాడు. ఏవేవో గుర్తొచ్చాయి. నవ్వు మెరిసింది. అంతలోనే ముఖం ముడుచుకున్నాడు. లింగయ్యకు ఆ చీరంటే చాలా మోజు. కాని రాజేశ్వరమ్మ రాత్రి ఆ చీరను ఎప్పుడూ కట్టుకోలేదు. అదే లింగయ్యకు కోపం.

"ఎందుకు ఉతికినవు? ఇప్పుడు కట్టుకుంటవ?" అడిగాడు లింగయ్య.

"ఎందుకు? కొడుకు, కోడలు చీరెలు కొంటలేరని లోకం బదునాం చేయాలనా?" కోడలు కళావతి కంఠం ఖంగుమంది.

విశ్వనాథం పాత సామానంతా వాకిట్లో పడేశాడు. ఎవరో పాత సామాను కొంటాం అని అరుస్తూ పోతుంటే పిలిచాడు. సామాను చూసి ధర కట్టమన్నాడు. మూడు రూపాయలకి కిలో అంటూ అంతా కలిపి నూటయాభై రూపాయలిస్తానన్నాడు. వాడకానికి పనికొస్తే వాటికి పదివేల రూపాయలైనా విలువుంటుంది. రూపాయకు నయాపైసా లెక్కనైనా రాదు అమ్మితే. విశ్వనాథం మనస్సు కలుక్కుమంది. వాటిని అమ్మేయ బుద్ధికావడంలేదు. అవన్నీ తమ సొంతింటి మ్యూజియం.

"అవి ఏమన్నయిరా విశ్వనాథం. అమ్మితే వచ్చే ఆ పైసలతోని ఏం వస్తయిర. కుల కశిపి యిసెరెలు, వాడుకున్న కందిల్లు, పారలు... అమ్ముకుంటార్ర! అటుకుమీద ఓ మూలకు ఉండనీ ఏందిరా?" అన్నాడు లింగయ్య.

విశ్వనాథంకు కూడా అలాగే అన్పించింది ధర విన్నాక. కాని కళావతికి ఆ మాట నచ్చలేదు. "అటుక మీద ఏం పెట్టుకోరాకుండ ఈ పాత సామానెందుకు? అమ్మబుద్ధి కాకపోతే ఎవరికైనా అక్కరకొస్తే ఉత్తగనే ఇవ్వుర్రి. యాది చేసుకుంటరు" అంది కళావతి.

కోడలు కళావతి ఈమధ్య బీడీలు చేస్తూనే ఇంట్లో చీరెల బేరం మొదలుపెట్టింది. ఎలుకల్తో, చిన్నచిన్న పురుగుల్తో వశపడ్తలేదు. ఎలుకలు పిల్లుల పరుగులకు ఎప్పుడు ఏది మీద పడ్తదో అని కళావతి భయం.

గతంలో రెండుసార్లు యిలాగే జరిగింది. అమ్మబోయి ఆఖరు క్షణంలో తండ్రి మాటతో విశ్వనాథం మనస్సు మార్చుకున్నాడు. కొడుకులు కోడండ్లు అన్నీ పంచుకున్నారుగానీ ఈ పాత సామాను పంచుకోలేదు. జాగా వేస్టు అనుకున్నారు.

నెత్తిన తువాలు వేసుకొని వీరయ్య తాత వచ్చాడు. ఇల్లంతా చిందరవందరగా ఉండడం చూసి కాని వేళలో వచ్చానా అని మదనపడ్డాడు.

రాజేశ్వరి "మామా! ఏమైనా సల్లపడి వచ్చినవా?" అని అడిగింది.

"లేసి ఇటే వచ్చిన" అన్నాడు వీరయ్య.

వాకిట్లో ఆరేసిన పాత చీరెను ఎక్కన్నో చూసినట్టనిపించింది వీరయ్యకు. "అమ్మాయీ! ఈ పాత చీరె ఎక్కడిదే" అంటూ అడిగాడు.

"మామా! ఈ ఇండ్లల్లకు పోయినపుడు నువ్వు పెట్టిందేనే" అంది రాజేశ్వరి.

అరవై నంబరు చీర. జరీ అంచుతో మేనకోడలుకని ప్రత్యేకంగా నేయించిన విషయం వీరయ్యకు గుర్తొచ్చింది.

"అత్తా! ఇంకో రెండుసార్లు సర్ఫ్ వేసి ఉతికితే లావణ్య

**ఆడపిల్లలకు పెళ్ళిసంబంధాలు వెతకడానికి తప్ప ఈ బంధుత్వాల అవసరాలే అంతరిస్తున్నాయి. కొత్త వియ్యంకులు, వియ్యపురాళ్ళు, కొత్త కోడళ్ళు, అల్లుళ్ళు, వారి తల్లిదండ్రులు వారి తోడల్లుళ్ళు, వారితో సంబంధాలు కలుపుకుపోవడమే జీవితం అయిపోయింది. పిల్లలకు పాత చుట్టాలు ఎలా చుట్టాలో తెలియని దశ వచ్చేసింది. వయస్సు, హోదా, అభిరుచుల అంతరాల రీత్యా పాత చుట్టాల పిల్లలతో తమ పిల్లలకు స్నేహమే లేకుండా పోయింది. ఈ జీవి కొట్టుకున్నంత కాలం పాత చుట్టాల మీద ప్రాణం కొట్టుకుంటుంది అనుకుంది రాజేశ్వరమ్మ.**

బిడ్డ పొత్తిళ్ల పేగులకు పనికొస్తది" అంది కోడలు కళావతి.

వాడుకునేవాళ్ళుంటే పైనవేసి కుడ్తే బొంతకు ఈ చీర అద్భుతంగా ఉంటుంది. కాని చివరకు చింపిరి పీతిపేగులుగా వాడ్డమా? రాజేశ్వరమ్మకు ఏదోలా అన్పించింది.

"మనుమరాలును దవాఖాన నుండి ఎప్పుడు తెస్తున్నారే అమ్మాయీ" అని అడిగాడు వీరయ్య.

"రేపు వస్తుంది తాతయ్యా! అందుకే ఇల్లంతా ఊడ్చి ఓసారి సర్దడం. డెడాల్, ఫినాయిల్ వేసి అటక గోడల్తోసహా ఇల్లంతా కడిగితే సరే లేకపోతే లావణ్యను మా ఇంటికే తీసుకుపోతా" అన్నాడు వాళ్ళాయన రవీందర్" అంది కోడలు కళావతి.

"మేం పోయినంక పాత సామాను ఏం చేసినా మేం చూడరాము. ఇంకా కొద్దిరోజులు ఓపిక పట్టుర్రి" అన్నాడు

**రాజేశ్వరమ్మ తన పాతకాలం నాటి సూటుకేసు తీసుకొని బట్టలు దులిపింది. అందులో తనకెంతో ఇష్టమైన పాత చీర. వెనకటివన్నీ నూలు చీరలే. నూలు చీరల్తో ఓ సౌకర్యం ఉంది. అవి చిరిగిపోయాక రెండు చీరలు వేసుకొని కుడ్తే ఓ మెత్తని బొంత అయ్యేది**

లింగయ్య కొడుకూ కోడలు కేసి చూస్తూ.

"మీరెన్నడు పోవాలె. మీకన్నా ముందే మేం పోతం కావచ్చు" అని అందామని నోటిదాకా వచ్చి ఊరుకుంది కోడలు కళావతి. కొడుకు విశ్వనాథం పాతసామానంతా ఓ మూలకు పేర్చాడు. అటకంతా ఊడ్చి ఫినాయిల్ నీళ్ళు చల్లాడు.

* * *

లావణ్య రెండో కూతురు నామకరణోత్సవం. లింగయ్య పెదనాన్న కొడుకులూ కోడండ్లూ, పెద్దమ్మ కొడుకులూ కోడండ్లూ, రాజేశ్వరమ్మ పెదనాన్న, చిన్నాన్న, మేనత్త కొడుకులూ కోడండ్లూ, అల్లుండ్లూ, బిడ్డలూ, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్లు... ఇలా ఎందరెందరో పాత చుట్టాలని పిలిచారు. సిటీలో పి.జి చేస్తున్న వనజ, ఆమె ఫ్రెండ్సిద్దరు వచ్చారు. రాజేశ్వరమ్మ మూడో కోడలు, కొడుకు రమేష్ పట్నం నుంచి దిగారు.

మూడో కోడలు మాధవిని చాలామంది గుర్తుపట్టి పలకరించారు. కాని మాధవి వాళ్ళెవరిని గుర్తుపట్టలేకపోయింది. ఆమె పెళ్ళయ్యాక అత్తవారింట్లో ఉన్నదే కొద్దిరోజులు. ఆ కొద్దిరోజులు ఆడపడుచులు, వారి బంధువులు, తోడికోడళ్ళ సంబంధీకులు పరిచయం అయ్యేసరికే ఎవరు ఎవరి తాలూకో తేల్చుకోలేక కన్ఫ్యూజ్ అయింది. వనజ సిటీలో చదువుతుండడంతో ఆమె స్థితీ ఇలాగే ఉంది.

"వనజవ్వకు పెళ్ళికళ వచ్చింది. ఎప్పుడు చేస్తరే" అని రాజేశ్వరమ్మని అడిగింది లింగయ్య పెద్దనాన్న కూతురు గంగవ్వ. అలా ఒకరి వెంట ఒకరికి ముచ్చట్లకు అదే టాపిక్ అయిపోయింది. తన పెళ్ళి గురించి వీళ్ళందరికి ఇంత ఆసక్తి దేనికి. తన పెళ్ళి తన ఇష్టం. ఎప్పుడైనా ఎవర్నైనా చేసుకుంటుంది. వీళ్ళకేం పని అని మనసులో విసుక్కొంది వనజ.

"వాళ్ళంతా మన సుట్టాలే. పెద్దన్న పుట్టకముందు నుంచి వీళ్ళంత ఏ పండుగు జరిగినా మనింటికి రావల్సినోల్లు" అంటూ లింగయ్య పరిచయం చేశాడు. వనజకు ఆ పరిచయాలపై ఆసక్తి లేదు. తన క్లాసుమేట్లు పైనే ఆసక్తి.

రెండో కోడలు కళావతి ఉన్నంతలో అందరికి కాస్త పరిచయం. పురుడై చాలామంది వెళ్ళిపోయారు. వీరయ్య, లింగయ్య పెద్దమ్మ కూతురు గంగరాజక్క వంటి కొందరు వృద్ధులు, లావణ్య అత్తవారి తరఫువారు కొందరు మిగిలారు.

తెల్లవారింది. రెండో కోడలు కళావతి విసుక్కోవడం మొదలైంది. నల్లా నీళ్ళుచాలవు. పాలు చాలవు. ఇల్లు చాలదు. కూరగాయలు చాలవు. గిన్నెలు చాలవు. విశ్వనాథంకు కూడా కాస్త కష్టమనిపించింది.

రాజేశ్వరమ్మ లింగయ్యలు ఆ మాటలు విన్నారు. లావణ్య వాళ్ళ అత్త, వాళ్ళాయన ఆ మాటలు విన్నారు. అలిగి వెళ్ళిపోతానని రెడీ అయ్యారు. కళావతి కంగారుపడిపోయింది. వాళ్ళను తానేమనలేదంది.

వీరయ్య మామ కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఏదో మేం ఉన్నంత కాలం గిట్లనే సూడాలని పానం కొట్టుకుంటదే. ఆ తర్వాత మా పిల్లలు మిమ్మల్ని గుర్తుపట్టరు. మీరు



## సక్సెస్ వచ్చినపుడే తలవంచుకోవాలి

నిన్నగాక మొన్న వచ్చిన వారు కూడా కేవలం ఒకే ఒక్క సక్సెస్‌తో తలెగరేస్తుండటం చిత్రపరిశ్రమలో చూస్తూనే ఉన్నాం. ఈ విషయమై ఓ సారి మాటల సందర్భంగా ప్రముఖ నిర్మాత డి.రామానాయుడు వ్యాఖ్యానిస్తూ "సక్సెస్ వచ్చినపుడే తలవంచుకుని ఉండాలి. పరాజయం ఎదురైనపుడు మాత్రం తలెత్తుకు తిరగాలి. ఎదురైన పరాజయాన్ని పట్టుదలతో అధిగమించటానికి ప్రతి వ్యక్తీ కృషి చేయాలి. అప్పుడే జీవితంలో ముందడుగు వేయగలం" అని అన్నారు. ఎదిగే కొద్ది ఒదిగి ఉండాలనే రామానాయుడు మనస్తత్వమే ఆయన్ని గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కేలా చేసిందనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

– సౌమిత్



2

వాళ్ళను గుర్తుపట్టరు" అన్నాడు వీరయ్య.

రాజేశ్వరమ్మ ఆలోచిస్తోంది. ఎంతోమంది పాత చుట్టాలు. ఎవరితో ఏ పని పడదు. వాళ్ళకూ అంతే. ఆడపిల్లలకు పెళ్ళిసంబంధాలు వెతకడానికి తప్ప ఈ బంధుత్వాల అవసరాలే అంతరిస్తున్నాయి. కొత్త వియ్యంకులు, వియ్యపురాళ్ళు, కొత్త కోడళ్ళు, అల్లుళ్ళు, వారి తల్లిదండ్రులు వారి తోడల్లుళ్ళు, వారితో సంబంధాలు కలుపుకుపోవడమే జీవితం అయిపోయింది. పిల్లలకు పాత చుట్టాలు ఎలా చుట్టాలో తెలియని దశ వచ్చేసింది. వయస్సు, హోదా, అభిరుచుల అంతరాల రీత్యా పాత చుట్టాల పిల్లలతో తమ పిల్లలకు స్నేహమే లేకుండా పోయింది. ఈ జీవి కొట్టుకున్నంత కాలం పాత చుట్టాల మీద ప్రాణం కొట్టుకుంటుంది. అనుకుంది రాజేశ్వరమ్మ. వీరయ్య మామను తీసుకొని తెలిసిన డాక్టరు దగ్గరకు బయల్దేరింది రాజేశ్వరమ్మ.

డాక్టరు రాసిచ్చిన మందులు కొని వీరయ్య మామకిప్పించి ఇంటికి చేరేసరికి ఇంట్లో ఏదో వెలితి కన్పించింది. ఇంటిముందు ఓ మూలకు కుప్పపోసిన పాత సామాను కన్పించలేదు. గంగరాజక్క వెళ్ళిపోయింది. మనుమరాలికి బొంత కుట్టిద్దామని మళ్ళీ బాగా ఉతికి ఆరేసిన పాత చీర కన్పించలేదు. లావణ్య ఆ చీరను చింపి తన కూతురి పీతిగుడ్డల కోసం ముక్కలుగా చేసింది.

"అయ్యో పాతచీరె చింపినావే" అంది రాజేశ్వరమ్మ కూతురుతో.

"ఔనే అమ్మా! కళావతి వదిన చెప్పింది దీనికి పీతిగుడ్డలకు పనికొస్తదని నువ్వే తీసి ఉతికి ఆరేసినవట గద" అంది లావణ్య.

బాధగా నిట్టూర్చింది రాజేశ్వరమ్మ. వీరయ్య మామకు ఆ చీరను చూసినపుడు ఈ ఇల్లు తనవాళ్ళది అని కలిగిన ధీమా పూర్తిగా దిగిపోయింది. చిరిగిన పాత చీర పేగులు చూసి తాను ఎవరో పరాయివాళ్ళింట్లో వున్నట్టనిపించింది.

"అమ్మా! ఈ ముసలి తాతయ్య ఎవరే" అని అడిగాడు రెండో కోడలు కళావతి చిన్నకొడుకు ప్రవీణ్.

"నానమ్మ అమ్మకు తమ్ముడురా!" అంది కళావతి.

"అలా అంటే ఎవరే? నానమ్మ... అమ్మకు... తమ్ముడు.. అంటే?" అని అర్థంకాక ప్రశ్నించాడు ప్రవీణ్.

ఎట్లా అర్థం చేయించాలో కళావతికి తోచలేదు.

"తాతయ్యా! మీది ఏవూరు? పెదనాన్న నీకు కలుస్తారా? పెదనాన్న కొడుకు విద్యాసాగర్ అన్నయ్య ఇపుడు కాలేజీ చేస్తున్నాడటకదా... నిన్న ఫంక్షన్‌కు ఎందుకు రాలేదు. నాకు అన్నయ్యను చూడాలని వుంది. నువ్వు పోయి పంపిస్తావా తాతయ్యా!" అన్నాడు ప్రవీణ్.

వీరయ్య మామకు ఏం చెప్పాలో తోచలేదు. వాడికి వాళ్ళ పెద్దనాన్న కొడుకే తెలియదు. తననేం గుర్తుపడ్తాడు అనుకున్నాడు.

ఎక్కడికో పోయిన లింగయ్య వచ్చి పాత సామాను గుట్ట లేకపోవడం చూసి అవాక్కయ్యాడు. "ఈ సామాను ఏమైందే" అంటూ ఒక్కసారిగా అరిచాడు. తన అనుభూతులు, అనుభవాలు, జ్ఞాపకాలన్నీ ఎవరో ఊడ్చి పారేసినట్టనిపించింది.

మూడు నెలల దాకా లావణ్య ఇక్కన్నే వుంటదిగదా. ఇల్లు సాల్తలేదు. మీరు ఇంటెనుక రేకుల కింద పడుకోండి. మీకోసం వచ్చే చుట్టాలు బాలెంత ఉన్నకాడికొస్తే ఎట్ల" అంది కళావతి. ఎంతో నొచ్చుకుంటూ చేసేదిలేక తమ పాతబట్టలు, మంచం తీసుకొని ఇంటెనుకకు నడిచింది రాజేశ్వరమ్మ.

"పోతనే అమ్మాయీ" అంటూ వీరయ్య మామ వెళ్ళిపోయాడు. లావణ్య బాలెంత మంచం ముందుగదిలోకి మారింది. ◎

# ఉరకలేసే వయసు - అదుపులేని మనసు

మనిషి జీవితంలో యౌవనం తొలిదశ కాస్త తికమకలతో కూడుకున్నది అని చెప్పవచ్చు. అదుపులేని భావోద్రేకాలు ఉంటాయి. తప్పులు జరగడానికి ఆస్కారం ఎక్కువగా ఉండే వయసు కూడా. అంతేకాదు జీవితాన్ని అర్థం చేసుకునే క్రమంలో దొర్లే పొరపాట్లుంటాయి.

21ఏళ్ళ రోషన్ ఒకరోజు ఆగమేఘాలమీద ఇంటికి చేరాడు. 'ఏక్ దుజే కేలియే'సినిమా చూసిన అతగాడి మీద ప్రేమ ప్రభావం ఎక్కువగా పడింది. ఇంటికి రాగానే తల్లిదండ్రులతో "నేను నా స్నేహితుడి చెల్లెలిని పెళ్ళి చేసుకోబోతున్నాను" అని ప్రకటించేశాడు. ఆమె కోసం తల్లిదండ్రులను, ఆస్తిపాస్తులను వదులుకునేందుకు సిద్ధమేనని తెలియజేశాడు. అతను చేసుకోదలచింది కులాంతర వివాహం. తానేదో సాహసోపేత నిర్ణయం తీసుకోబోతున్నట్టు అతని భావన. కానీ బంధువులు కొందరు నవ్వారు. ఎందుకంటే అతని తల్లిదండ్రులది కూడా కులాంతర వివాహమే. రోషన్ తన ప్రేమ మహత్తును మరింతగా ఎక్కువ ఊహించి మాట్లాడసాగాడు. యవ్వనం తొలిదశలోని యువతీయువకుల సహజప్రవర్తనే అతనిదీను. అతను ప్రేమ అనుకున్నది ఆకర్షణ అని చెప్పవచ్చు. ఇన్‌ఫాచ్యుయేషన్.



డాక్టర్ పి.టి.సుందరం
న్యూరో సైకాలజిస్టు

'తల్లిప్రేమనో, తండ్రి ప్రేమనో పోగొట్టుకున్న యువతీయువకులు సహజంగా ఆ లక్షణాలున్న అపోజిట్ సెక్స్ లవ్‌లో పడతారు' అంటాడు కార్ల్‌జంగ్. అపోజిట్ సెక్స్‌లో తాము కోరుకున్న లక్షణాలు కనిపించగానే ఇక తామిద్దరం 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అనుకుంటారు.

ఇంటిలో తన ప్రేమ, పెళ్లి గురించి ప్రకటించిన రోషన్ ఆర్నెల్లపాటు తల్లిదండ్రులను ఒప్పించడానికి ప్రయత్నించాడు. అమ్మానాన్నలు ఒప్పుకోలేదు. అతను ఆ అమ్మాయిని పెళ్లిచేసుకుంటే ఆత్మహత్యచేసుకుంటామని బెదిరించారు. రోషన్‌కు స్వంత సంపాదనలేదు. తల్లిదండ్రులమీదే ఆధారపడి వున్నాడు. అమ్మాయి తల్లిదండ్రులు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఓసారి రోషన్ తల్లిదండ్రులను కదిలించి చూశారు. వీరు ఒప్పుకోకపోవడం వారి అహాన్ని దెబ్బతీసింది. బిగదీసుకుపోయారు. అమ్మాయిని కాలేజీ మాన్పించారు. ఇంటిల్లిపాది ఢిల్లీ వెళ్లిపోవడానికి నిర్ణయించుకున్నారు. ఈ విషయాలన్నీ తెలిసిన ప్రేమికుడు రోషన్ దేవదాసుగా మారిపోయాడు. మందు అలవాటు చేసుకోకున్నా గడ్డం పెంచేసి నిరంతరం ఆలోచనల్లో మునిగితేలాడు. ఒకనొకరోజు ఎలుకల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. ఆస్పత్రిపాలయాడు. అదృష్టవశాత్తు చావు తప్పింది. అతని తల్లిదండ్రులు మానసికనిపుణులను ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు.

మరో ఉదాహరణ చూద్దాం. రాజు అనే విద్యార్థి ఎమ్‌సెట్ ఎగ్జామ్ కోసం సిద్ధమవుతున్నాడు. ఎప్పుడూ తనగదికి తలుపులు వేసుకుని ఉండేవాడు. గదిలో బోర్లాపడుకుని ఒకచేతిలో పుస్తకం, మరో చేతిలో రిమోట్ కంట్రోల్ ఉంచుకునేవాడు. ఎందుకో తెలుసా? టి.వి.తెరమీద అర్థనగ్నసుందరీమణులను చూడటానికి. అతని అభిమాన ఛానెల్ ఎం.టి.వి 'మిడ్‌నైట్ మసాలా", "రెయిన్ సాంగ్స్" "హిప్ షేకర్స్" తనివితీరా చూసేవాడు. తెరపై తన అభిమాన కథానాయిక కనిపించగానే మరింతగా ఎగ్జయిట్ అయ్యేవాడు. హస్తప్రయోగం మొదలుపెట్టేవాడు. అలా టి.వి. చూస్తూ, ఉద్రేకపడుతూ రాత్రి మూడింటికి నిద్రలోకి జారుకునేవాడు. తల్లిదండ్రులు బలవంతంగా ఉదయం ఆరింటికి నిద్రలేపేవారు.

కోచింగ్ ఇన్సిట్యూట్ నుంచి ఇంటికి తిరిగివచ్చేటప్పుడు బస్సులో సైతం రాత్రి ఆలోచనలే అతని బుర్రలో తిరుగుతుండేవి. రాజు విషయంలో వీర్యస్కలనం అనేది ఎక్కువయింది. రోజుకు రెండు మూడుసార్లు అతను ఉద్రేకపడేవాడు. దాంతో అతను మానసికంగా నీరసించడం మొదలుపెట్టాడు. తను తప్పుచేస్తున్నానన్న భావన ఎక్కువ కాసాగింది. అయితే బలహీనత అతన్ని ఏడిపిస్తూంది. నిస్సహాయత ఆవరించిందతనికి. అతను తన వ్యక్తిగత విషయాన్ని ఎవరితోనూ చర్చించలేదు. దాంతో మనసులో భారం మరింత పెరిగింది. నేరభావన కుంగదీయసాగింది. పుస్తకం తెరిస్తే నిద్రవచ్చేసేది. అతని దినచర్య పూర్తిగా దెబ్బతింది. వేళకాని వేళల్లో ఆకలివేసేది. రాజు ఈ బాధ నుంచి ఉపశమనం కలిగించమని దేవుణ్ణి వేడుకున్నాడు. ఆ సమయంలోనే ఒక దినపత్రికలో వార్త అతను చూడటం జరిగింది. అది ఎన్.ఎల్.పి చికిత్స గురించిన సమాచారం. వందలాది విద్యార్థుల్లానే అతను ఎన్.ఎల్.పి.మీటింగులకు హాజరయ్యాడు. డాక్టర్‌తో అపాయింట్‌మెంట్ తీసుకున్నాడు. ఆరునెలల చికిత్స తర్వాత నమ్మలేనంతగా రాజుమారిపోయాడు. కొత్తమనిషి అయ్యాడు. తన 'సెక్స్ ఎనర్జీ'ని 'స్టడీ ఎనర్జీ'గా మార్చుకోగలిగాడు. అతని 'వేల్యూ సిస్టమ్'మారింది. ఎమ్‌సెట్‌లో సీటు సాధించితీరాలన్న ఒకే ఒక లక్ష్యం ఏర్పరచుకున్నాడు.

రాజుకు ఉచితచికిత్స చేయడం జరిగింది. ఎన్.ఎల్.పి.రీసెర్చిలో భాగంగా మూడువందలమంది విద్యార్థులకు ఎన్.ఎల్.పి థెరపీ అందించడం జరిగింది. వీరిలో చాలామంది మొదటిసెషన్‌లోనే మంచి ఫలితాలు సాధించారు. అయితే మానుకున్నారు. కానీ రాజు ఆఖరి వరకు సహకరించాడు. ఆరునెలలపాటు థెరపీ తీసుకున్నాడు. పూర్తిగా మరిపోయాడు. ఇందులో అద్భుతమైన విషయం ఏమిటంటే రాజు సమస్య ఎవరికీ తెలియనట్టే రాజు ట్రీట్‌మెంటు తీసుకున్న విషయం కూడా ఎవరికీ తెలియదు. ఆఖరికి అతని స్నేహితులకు, తల్లిదండ్రులకు కూడా. ఎన్.ఎల్.పి.చికిత్సలో రోగివ్యక్తిగత అంశాలను అంత రహస్యంగా ఉంచుతారన్నమాట.

**(వచ్చేవారం నగేష్ కథ, ఎడాలిసెంట్ వయసులోని అమ్మాయి అబ్బాయిలకు కుటుంబంలో ఎదురయ్యే సమస్యలు)**





3